


కంబాలపల్లి ఉపకేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అంబరీష

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి
- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అంబరీష
- ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

బయ్యారం, డిసెంబర్ 8: వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అంబరీష హెచ్చరించారు. శుక్రవారం బయ్యారం, గంధంపల్లి పీహెచ్‌సీల పరిధిలోని గౌరారం, రామచంద్రాపురం, బాలాజీపేట, ఉప్పలపాడు, వెంకటాపురం, ఇస్లాపురం, లింగగిరి, పాత కంబాలపల్లి, మిరియాలపేంట ఆరోగ్య ఉపకేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగుల వివరాలు, ప్రసవాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అసంక్రమిత వ్యాధులైన బీపీ షుగర్, క్యాన్సర్, 30 ఏళ్ల పైబడిన వారందరిని స్క్రీనింగ్ చేసి మందులు అందించాలని తెలిపారు. కీటకజనిత వ్యాధులైన మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గున్యా వ్యాప్తి చెందకుండా ఫ్రైడే డ్రైడే, చేయాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా అందేలా చూడాలన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణులను పరీక్షించి మందులు అందేలా చూడాలని తెలిపారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. వైద్యులు విజయకుమార్, సాగర్, సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్, డీపీఎం రుక్ముద్దీన్ ఉన్నారు.



సాయిబాబా పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

## సాయిబాబాకు ఘనంగా పల్లకీసేవ

మరిపెడ, డిసెంబర్ 8: మున్సిపల్ కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. బాబాకు పల్లకీ సేవ నిర్వహించి సామూహిక భజన చేశారు. అనంతరం వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై భక్తులు, ప్రయాణికులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ నిర్వాహకుడు వెంపటి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఆలయంలో అన్నదాన కార్యక్రమానికి విరాళం అందించేదుకు ముందుకు రావాలన్నారు. బోనగిరి సత్యనారాయణ, ఎర్రోళ్ల శ్రీనివాస్, రవీంద్రచారి పాల్గొన్నారు.



హెచ్‌ఎం రమేశ్‌బాబుకు ప్రింటర్ అందిస్తున్న రమణారెడ్డి తల్లిదండ్రులు

## పాఠశాలకు ప్రింటర్ అందజేత

మహబూబాబాద్ రూరల్, డిసెంబర్ 8: మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి ప్రింటర్ బహూకరించారు. గణిత ఉపాధ్యాయుడు రామసహాయం శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో అమెరికాలో ఉద్యోగం చేస్తున్న పూర్వ విద్యార్థి సాబాది రమణారెడ్డి తన తల్లిదండ్రులు వెంకన్న, మంజుల చేతుల మీదుగా రూ.25 వేల విలువైన ప్రింటర్‌ను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రమేశ్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ప్రింటర్ అందించిన రమణారెడ్డి, తల్లిదండ్రులను అభినందించి శాలువాతో సత్కరించారు. గ్రామంలోని దాతలు ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉప్పలయ్య, శ్రీనివాస్, తిరుపతి, సతీశ్, వనజ, కవిత పాల్గొన్నారు.

- రాత్రి, పగలు తేడా లేకుండా ట్రాక్టర్ల ద్వారా తరలింపు
- ఒక్కో ట్రాక్టర్ రూ.4వేల నుంచి రూ.6వేలకు అమ్ముతున్నారని గ్రామస్తుల ఆరోపణ
- వాహనాల స్పీడ్‌తో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు



రామన్నగూడెం ఆకేరు వాగులో నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను నింపుతున్న కూలీలు

# ఆకేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా

**ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదు**

ఇసుక తరలించేందుకు గతంలో ఆర్డీవో ఆదేశాల మేరకు మాత్రమే అనుమతులు ఇచ్చాం. ఇప్పుడు ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదు. కలెక్టర్ ఆదేశాల మేరకు మైనింగ్ అధికారుల అనుమతి తీసుకుంటేనే ఇసుక రవాణాకు అనుమతులు ఉన్నాయి. అక్రమంగా ఇసుకను తరలిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. **-వివేక్, తహసీల్దార్**

నర్సింహులపేట, డిసెంబర్ 8: మండలంలోని ఆకేరు వాగు పరిసర గ్రామాల శివారు నుంచి రాత్రి, పగలు విచ్చలవిడిగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ దందా అక్రమార్కులకు మూడు ట్రాక్టర్లు ఆరు ట్రిప్పులుగా సాగుతున్నది. దీనిని కొందరు సంబంధిత అధికారులతో మాట్లాడి దగ్గరుండి నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నా సంబంధింత శాఖల పర్యవేక్షణ సరిగా లేకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మైనింగ్, పోలీస్, రెవెన్యూ పర్యవేక్షణ లోపంతోనే ఎలాంటి ఆధారాలు లేకుండా ఇసుకను తరలిస్తున్నారని పేర్కొంటున్నారు. ఇసుక అక్రమ రవాణా వల్ల రూ. 2500కు వచ్చే ట్రాక్టర్ ఇసుక, రూ.4వేల నుంచి రూ.6వేల వరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'ర్యాంపు నుంచి ఇసుక రవాణా ప్రారంభించండి, మాది మాకు ఇవ్వండి.. అని ఓ మండల స్థాయి అధికారే ఈ దందాకు అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.




నర్సింహులపేటలో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

**నిత్యం రోడ్డు ప్రమాదాలు**

నిత్యం ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండడం, మైనర్లు డ్రైవింగ్ చేస్తుండడం.. ట్రాక్టర్ స్పీడ్ లాక్‌లు తీసివేసి 50 నుంచి 60 కిలోమీటర్ల స్పీడ్‌లో వెళ్తుండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వక్తం చేస్తున్నారు. ఇటీవల జయపురంలో కూలీ పనులకు వెళ్తున్న ఆటోను ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ట్రాక్టర్ల స్పీడ్‌కు బ్రేకులు వేయకపోతే చిన్న పిల్లలు, ప్రజలు రోడ్డుపైకి వచ్చే అవకాశం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

## 'తొలిమెట్టు'ను సమర్థవంతంగా నిర్వహించాలి

కేసముద్రం, డిసెంబర్ 8: పాఠశాలల్లో తొలిమెట్టు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని తాళ్లపూసపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కోట కనకయ్య అన్నారు. పాఠశాలల్లో కార్యక్రమ అమలు తీరుపై శుక్రవారం జడ్పీ హైస్కూల్‌లో కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు కనీస, అభ్యాసన సామర్థ్యాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతిరోజూ విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఉపాధ్యాయులు గోపాల శ్రీధర్, గోపాలరావు, సీఆర్పీ నేరెళ్ల పద్మ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి

తొర్రూరు, డిసెంబర్ 8: రైతులు పండించిన ధాన్యం ఉత్పత్తుల కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు కల్లాలు, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ధాన్యాన్ని తడవకుండా కాపాడుకునేందుకు అనేక కష్టాలు పడుతున్నారని, కలెక్టర్ చొరవ తీసుకొని యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలని కోరారు. తడిసిన, రంగు మారిన, తేమతో ఉన్న ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. వర్షాలతో దెబ్బతిన్న పంటలను వ్యవసాయశాఖ అధికారుల ద్వారా సర్వే చేయించి రైతుకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే బాధిత రైతాంగంతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎండీ షరీఫ్, శ్రీరాం పుల్లయ్య పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రవి

## రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

**డీసీసీబీ డైరెక్టర్ యాదగిరిరెడ్డి**

మరిపెడ, డిసెంబర్ 8: తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల పంటలు దెబ్బతినడంతో కర్షకులకు కన్నీళ్లు మిగిలాయని, వారికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ చాపాల యాదగిరిరెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. శుక్రవారం మున్సిపల్ కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వరి పంట కోతలు పూర్తి చేసుకొని ఇంటికి తరలించే వేళ వర్షాలు పడడంతో తడిసి తీవ్ర నష్టం జరిగిందన్నారు. పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి పరిహారం అందజేయాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న యాదగిరిరెడ్డి

## పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాస్**




సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

గార్ల, డిసెంబర్ : మిగ్‌జాం తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తుఫాన్‌తో రైతులు భారీగా పంట నష్టం జరిగిందని, వ్యవసాయ శాఖ అధికారులతో సర్వే చేయించి, ఎకరానికి రూ. 50 వేల నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భూక్యా హరి, వెంకటేశ్వర్లు, రాజారావు, సత్యవతి, నాగమణి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.